క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణదానం

బాలాజీచెరువు: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ పేర్కొన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రహదారి భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. స్థానిక లారీ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో లారీ డ్రైవర్లు, యాజమానులు, డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు కలిపి 600 మందికి పైగా రక్తదానం చేశారు. అనంతరం ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు, గత వారం విద్యార్థులకు నిర్వహించిన రోడ్ సేఫ్టీ పోటీల విజేతల బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మనీష్ పాటిల్, డీటీసీ శ్రీధర్, ఎంవీఐ హరినాథరెడ్డి, సబిత, మురళీకృష్ణ, మెడికల్ ఆఫీసర్ పద్మావతి పాల్గొన్నారు.

16 నుంచి వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక రామకృష్ణారావుపేటలోని శ్రీ, భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి 26 వరకూ జరుగుతాయని ఆలయ ధర్మకర్త మునగాల గురనాథరెడ్డి శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 16న ఉదయం స్వామి వారి ఉత్సవ మూర్తుల ఊరేగింపు, అనంతరం లక్ష్మీ గణపతి హోమం, 11.30కి స్వామి వారి కల్యాణం వైభవంగా జరుగుతాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు 17న శేష వాహనంపైన, 18న హంస వాహనంపైన, 19న సింహవాహనంపైన, 20న కల్పవృక్ష వాహనంపైన, 21న గరుడ వాహనంపైన, 22న హనుమద్వాహనంపైన, 23న చంద్రప్రభ వాహనంపైన, 24న అశ్వ వాహనంపైన, 25న గజ వాహనంపైన ఊరేగుతారన్నారు. ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా ఆలయం వద్ద కోల సంబరం జరుగుతుందన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ఘనంగా శిరిడీ సాయి మందిరం వార్షికోత్సవం

కరప: మండలం గురజనాపల్లిలోని షిరిడీ సాయి మందిరం 16వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఆలయ వ్యవస్థాపకుడు కర్నాసుల శివకుమార్ ఆధ్వర్యంలో సాయిసేవకులు, సాయి దీక్షాధారులు ఘనంగా నిర్వహించారు. ఆలయం అర్చకుడు వెలవలపల్లి కామేశ్వరశర్మ, అచ్యుతరామశాస్త్రి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాద వితరణ చేశారు. కొవ్వాడ శ్రీనివాస కోలాట బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

మహాలక్ష్మమ్మ ఆలయంలో..

మండలం గొడ్డటిపాలెం గ్రామదేవత మహాలక్ష్మమ్మతల్లి పునఃప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, మూలమంత్ర మూర్తికి విశేష పూజలు నిర్వహించారు.

అమ్మవారి గుడి శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల వినతిమేరకు గతేడాది అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేయగా, గ్రామస్తులిచ్చిన విరాళాలతో ఆలయాన్ని నిర్మించారు. గొడ్డటిపాలెం, పరిసర గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 6 వేల మందికి అన్నదానం చేశారు. ఆలయకమిటీ సభ్యులు వాసంశెట్టి శ్రీనుబాబు, వి.సుభాష్, శ్రీను, సురేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

కరప: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని కూటమి నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నడకుదురు, గురజనాపల్లి, పెనుగుదురు, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరిపల్లి తదితర గ్రామాల్లోని గ్రాడ్యుయేట్ ఓటర్లను కలసి కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. కూటమి నాయకులు ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వరరావు, దేవు వెంకటేశ్వరరావు, బండారు మురళి, ఎం.పుష్పలత, కె.వెంకటలక్ష్మి తదితరులు ప్రచారం చేసినవారిలో ఉన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

- నివేదికను పక్కదారి పట్టిస్తున్నారని వీఓఏ ఆవేదన

కాకినాడ రూరల్: తనపై వ్యక్తిగత కక్షలను పెంచుకుని అధికారులు ఇచ్చిన నివేదికను పక్కదారి పట్టిస్తున్నారని మండలంలోని పి.వెంకటాపురం వీఓఏ కనకమహాలక్ష్మి పేర్కొన్నారు. గ్రామంలోని శ్రీ సత్యసాయి గ్రూపునకు సంబంధించి బ్యాంక్ ఖాతాలో ఉండిపోయిన సొమ్ములను వారికి అప్పగించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఇవ్వకుండా కొందరు మహిళలు అడ్డుపడుతున్నారని శుక్రవారం ఆమె విలేకరులకు తెలియజేశారు. గ్రామంలో డ్వాక్రా సంఘాల సొమ్ములపై అవినీతి ఆరోపణలు చేయడంతో డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు వెలుగు అధికారులు దర్యాప్తు చేసి నివేదిక ఇచ్చారన్నారు. నివేదిక ప్రకారం లావాదేవీలలో కొన్ని తేడాలు ఉన్నాయని, గ్రామ సంఘానికి అప్పగిస్తానని తెలిపినా కావాలని కొందరు దుర్భాషలాడుతూ మానసికంగా వేధిస్తున్నారని వివరించారు.

పాలిథిన్ పాపం అందరిదీ!

- ప్లాస్టిక్‌పై నియంత్రణ కరువు
- అంతకంతకూ పెరుగుతున్న వినియోగం
- నామమాత్రంగా అవగాహన కార్యక్రమాలు





ఏ మార్కెట్‌లో చూసినా పాలిథిన్ కవర్లలో సరకులు తీసుకువెళ్తున్న దృశ్యాలే..

కాకినాడ సిటీ: ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తోంది. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ పరిమాణం కవర్లు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు కలుగుతాయని ఎన్ని అవగాహన కార్యక్రమాలు సాగుతున్నా ఉత్పత్తిదారులు, వినియోగదారుల కనీసం మార్పు రావడం లేదు. అలాగే వాటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం సరకు మూలం ఎక్కడో, ఎక్కడ ఉత్పత్తవుతోందో తెలిసినా అచేతనంగా చూస్తున్నారు తప్ప కనీస చర్యలు లేవు. కాకినాడ రూరల్, సిటీ నియోజకవర్గాల పరిధిలో నిత్యం ఎక్కడపడితే అక్కడ రహదారులు, దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది.

నిబంధనలకు గండి

75 మైక్రాన్లలోపు మందం గల ప్లాస్టిక్‌ను వినియోగించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ఎవరూ పాటించడం లేదు. 75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ కవర్లు ఎక్కడ పడితే అక్కడే యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వ్యాపారులు సైతం అటువంటి సంచుల్లో సరకులు ఇచ్చి పంపుతున్నారు. దీనిని నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తే వాటి స్థానంలో జూట్ బ్యాగులను, క్లాత్ బ్యాగులను, కాగితం కవర్లను అందుబాటులో ఉంచాలి. అటువంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎవరూ చూపటం లేదు. సేంద్రియ పత్తి, వెదురు, చెక్క, మట్టి, పింగాణీ, ప్రకృతిలో త్వరగా కలిసి పోయే ప్లాస్టిక్‌తో చేసిన వస్తువులను వాడాలి. మట్టి, పింగాణి పాత్రలను ఆహారం నిల్వ చేయడానికి వినియోగించుకోవచ్చు. ప్రకృతిలో త్వరగా కరిగిపోయే చెత్త బుట్టలో‌లే వాడే కవర్లుగా, కాగితపు కప్పులకు వాడే పైపూతగా, పండ్లు, ఆహార పదార్థాలు, హోటళ్లలో పార్శిళ్లకు పంట పొలాల్లో మట్టిని కప్పేందుకు వాడుకోవచ్చు. ప్రజలు వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు రోడ్లపై వేయడంతో అవి తిన్న మూగజీవులు సైతం మృత్యువాత పడుతున్నాయని జంతు ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.

అవగాహన ఎక్కడా కనిపించడం లేదు

కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. టీ దుకాణాల వద్ద వేడి టీని ప్లాస్టిక్ కవర్లలో వేస్తున్నారు. అలా చేయడం వల్ల ప్లాస్టిక్ కరుగుతుంది. ఆ టీ తాగడంతో మానవుడు కొద్ది కాలనాకే క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారు. పట్టణ పరిధిలో ఎక్కడా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. అప్పుడప్పుడు అధికారులు వచ్చి తూతూ మంత్రంగా చెప్పి వెళ్తున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలి.

చర్యలు తీసుకుంటాం



ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించడానికి పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాం. వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం. కొన్ని షాపులపై దాడులు చేసి పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. నగరంలో నిషేధిత ప్లాస్టిక్‌ను వాడుతున్న వ్యక్తులపై కేసులు పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– పృథ్వీ చరణ్, నగరపాలక సంస్థ వైద్యాధికారి, కాకినాడ

అవయవదానంపై అపోహలు వద్దు



అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

బోట్‌క్లబ్: ఒకరి అవయవదానంతో ఎనిమిది మందికి ప్రాణదానం చేయవచ్చునని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవయవ దానం అంటే ఒక వ్యక్తి అవయవాన్ని తొలగించి మరొక వ్యక్తికి మార్పిడి చేయడానికి చట్టబద్ధంగా చేసే ప్రక్రియ అన్నారు. సాధారణ మార్పిడిలో మూత్రపిండాలు, గుండె, కాలేయం, క్లోమం, ఊపిరితిత్తులు, ఎముకలు ఉంటాయన్నారు. కొన్ని అవయవాలు జీవించి ఉన్న దాతలు సైతం దానం చేయవచ్చునన్నారు. మూత్రపిండం, కాలేయంలో కొంత భాగం, క్లోమంలో కొంతభాగం, ఊపిరితిత్తుల్లో కొంతభాగం దానం చేయవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ అవయవదానం మీద అపోహలు వీడి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మహోన్నతుడు దామోదరం సంజీవయ్య

- కలెక్టర్ షణ్మోహన్
- ఘనంగా నివాళులర్పించిన అధికారులు



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కాకినాడ సిటీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండవ, తొలి దళిత ముఖ్యమంత్రిగా అనేక సంస్కరణలకు నాంది పలికిన మహోన్నతుడు దామోదరం సంజీవయ్య అని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంజీవయ్య జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంజీవయ్య 104వ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకటరావు, ఇతర అధికారులు సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకటరావు ఆయన జీవిత విశేషాలను వివరించారు. ప్రభుత్వ సంస్థల నిర్మాణంలో పలు సంక్షేమ పథకాల అమలులో సంజీవయ్య చేసిన కృషి చిరస్మరణీయమైనదని అన్నారు. సంజీవయ్య 1921 ఫిబ్రవరి 14న కర్నూలు జిల్లా, కల్లూరు మండలం పెదపాడు గ్రామంలో ఒక దళిత కుటుంబంలో మునెయ్య, సుంకులమ్మ దంపతులకు జన్మించారని వివరించారు. నిరంతరం ప్రజల సంక్షేమానికి పాటుపడిన సంజీవయ్య నిజాయితీగా, విలువలతో కూడిన పరిపాలన అందించారని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి, బీసీ సంక్షేమాధికారి బి.లల్లీ, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు వై.వాణి, కె.రాధ, పీఎస్వీ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు, కలెక్టరేట్ వివిధ విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎస్పీలో..



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఎస్పీలో దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కమాండెంట్ ఎం.నాగేంద్రరావు, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మురళీమోహన్‌రావు, యూనిట్ మెడికల్ ఆఫీసరు లక్ష్మి, ఆర్ఐలు విఠలేశ్వరరావు, రవిశంకర్, ప్రసాద్, అజయ్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ నాగేంద్రరావు మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవడం మన కర్తవ్యమన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసినా చాలా నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు.

నిస్వార్థ సేవకుడు సంజీవయ్య

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జరిగిన జయంతి వేడుకలో దామోదరం సంజీవయ్య నిస్వార్థ సేవకుడని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంత జీఎం ప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములవుదాం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భావన

- కమిషనర్ భావన
- అధికారులతో సమీక్ష

కాకినాడ సిటీ: ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని, వీటిలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. శుక్రవారం నగరపాలక సంస్థ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వీధులు, డ్రెయిన్లు, పబ్లిక్ టాయిలెట్లు శుభ్రపరచడం, పార్కుల్లో తుప్పల తొలగింపు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శనివారం నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా సోర్స్–రిసోర్స్, థీమ్‌ను నిర్వహించనున్నారు. తడి, పొడి చెత్త, హానికరమైన చెత్తల సేకరణ, తడి చెత్తతో కంపోస్టు తయారీ, వ్యర్థాలు వేరు చేయడం ద్వారా సంపద సృష్టి కార్యక్రమాలపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. నగర ప్రజలు కూడా కాకినాడను పరిశుభ్రంగా ఉంచేలా అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత డివిజన్ నోడల్ అధికారులు, ప్రత్యేక అధికారులదేనని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ మత్స్యరాజు, టీపీఆర్‌వో శైలజ, మేనేజర్ సత్యనారాయణ, ఆర్‌వో శిరీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం శారదమ్మ గుడి వద్ద నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ, ర్యాలీలు నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

ఘర్షణలో యువకుడికి కత్తిపోట్లు

- యండమూరులో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు



తీవ్రంగా గాయపడిన ఈశ్వర ప్రసాద్



ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

కరప: వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో ఇద్దరి మధ్య చెలరేగిన వివాదం కత్తిపోట్ల వరకు దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలం యండమూరులో ఈ నెల 8వ తేదీన జరిగిన వేంకటేశ్వరుని రథోత్సవం నిర్వహించారు. రథం స్థానిక రామాలయం వద్దకు రథం చేరుకోగా అక్కడి యువకుడు, ఐటీఐ విద్యార్థి కుడుపూడి ఈశ్వరప్రసాద్ తన స్నేహితులతో కలసి తారాజువ్వలు వేశాడు. అక్కడే ఉన్న మారెళ్ల అజయ్, గుబ్బల కాలేబు, జిబేల్‌లు ఈశ్వరప్రసాద్ వద్దకు వచ్చి మాపైనే జువ్వలు వేస్తావా అని వాగ్వాదానికి దిగి నీ అంతు చూస్తానని దుర్భాషలాడుతూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు ఈశ్వర ప్రసాద్ కాలేజీలో ఉండగా అజయ్ ఫోన్‌చేసి నీతో మాట్లాడే పని ఉంది సాయంత్రం ఇంటికి రాగానే ఫోన్ చెయ్యి అని చెప్పాడు. ఈశ్వరప్రసాద్ ఇంటికి వచ్చాక తన సోదరుడు గుబ్బల సాయి, పితాని శేఖర్‌లను వెంటపెట్టుకుని మోటార్‌సైకిల్‌పై వెంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు వెళ్లేసరికి అక్కడ అజయ్, కాలేబు, విజయ్, వినోద్, అనిల్, మనోహర్, లచ్చన్న ఉన్నారు. అక్కడ అజయ్‌తో జరిగిన తోపులాటలో ఈశ్వరప్రసాద్ కింద పడిపోయాడు. అంతలో మిగిలిన వారు ఈశ్వరప్రసాద్‌ను కదలకుండా పట్టుకోగా అజయ్ కోడి కత్తితో దాడిచేసి, చంపేస్తానంటూ విచక్షణా రహితంగా పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. ఈ దాడిలో అతడికి తల, నుదురుకు ఇరువైపులా, ఎడమభుజం, కుడివైపు ఛాతీపై, చాతీకి మధ్య భాగంలో తీవ్రమైన రక్తపు గాయాలయ్యాయి. ఈశ్వరప్రసాద్‌పై దాడి చేస్తున్న వారిని అతడి ఐదుగురు స్నేహితులు అడ్డుపడి, చికిత్స కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ టి.సునీత సిబ్బందితో కల్సి గురువారం రాత్రి క్షేత్రస్థాయిలో వివరాలు ఆరా తీసి అనంతరం రామచంద్రపురం ఆసుపత్రికి వెళ్లి, మెరుగైన వైద్యం కోసం బాధితుడిని జీజీహెచ్‌కు తరలించగా, చికిత్సపొందుతూ కోలుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం యండమూరులో ఎప్పుడేం జరుగుతుందోననే ఉద్రిక్తత నెలకొంది. సీఐ చైతన్యకృష్ణతో పాటు కరప, గొల్లపాలెం, కోరంగి, పెదపూడి, తిమ్మాపురం ఎస్ఐలు పహారా ఏర్పాటుచేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిశోధనలకు రూ.93 లక్షల మంజూరు

- జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే వర్సిటీలో పరిశోధనలపై తొమ్మిది పరిశోధన ప్రాజెక్టులకు రూ.93 లక్షలు మంజూరైనట్టు జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ తెలిపారు. రూసా కో–ఆర్డినేటరర్ ఎం.స్వరూపారాణి అధ్యక్షతన వీసీ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్ష జరిగింది. పరిశోధన ప్రాజెక్టులకు సంబంధించి మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, వి.శ్రీనివాసులు, బీటీ కృష్ణ, పద్మప్రియ, సీహెచ్ శ్రీనివాసరావు, జి.స్వామినాయుడు, వీఎస్ వకుళ, సీహెచ్ నీలిమాదేవి, విజయ ప్రసాద్‌లు ప్రాజెక్టు ప్రధాన పరిశోధకులుగా వ్యవహరిస్తున్నారన్నారు. పరిశోధన ప్రాజెక్టులకు అవసరమైన పరికరాలు సమకూర్చుకోవాలని సూచించి సంబంధిత జర్నళ్ల ప్రచురితం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

భూసర్వే సమగ్రంగా చేయండి



తహసీల్దార్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: మండలాల్లో జరుగుతున్న భూసర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు అన్నారు. శుక్రవారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్యాలయంలో 3వ శనివారం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో రైతు వివరాలు నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్లను సందర్శించి మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీబీఏ చైనులు, తహసీల్దార్లు వి.జితేంద్ర, ఎస్ఎల్ఎస్ కుమారి, పి.త్రినాథరావు, కె.చిన్నారావు, జీఆర్ ఠాగూర్, కె.సత్యనారాయణ, ఎన్.సత్యనారాయణ, కె.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధిస్తున్న ఆకతాయిలు

కరప: ప్రేమికుల దినోత్సవం వేళ స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో కొందరు ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించారు. హైస్కూలు విద్యార్థినులు బస్ ఎక్కేందుకు శుక్రవారం సాయంత్రం రోడ్డుపక్కన నిలబడ్డారు. కొందరు ఆకతాయిలు అక్కడకు వచ్చి వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ కామెంట్లు చేశారు. మరికొందరు మోటార్‌సైకిళ్లపై తిరుగుతూ విసిగించారు. స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి ఆకతాయిలను పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయారు. పోలీసులు దగ్గరుండి, విద్యార్థినులను బస్ ఎక్కించి పంపించారు. కరప, వేళంగి, పెద్దాపురప్పాడు గ్రామాల్లోని హైస్కూళ్ల వద్ద నిత్యం తాము వచ్చి పోయే వేళల్లో ఆకతాయిలు ఇలాగే వ్యవహరిస్తున్నారని విద్యార్థినులు పోలీసులకు వివరించారు. పోలీసులు స్పందించి పాఠశాలల సమయంలో నిఘా పెట్టి, ఆకతాయిల వేధింపుల నుంచి విద్యార్థినులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉంది.

పుల్వామా అమరులకు నివాళి



సర్పవరం జంక్షన్‌లో అమర జవాన్లకు జోహార్లు అర్పిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కాకినాడ రూరల్: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సర్పవరం జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను పట్టుకుని వీర జవాన్లకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కాశ్మీర్ పుల్వామా జిల్లాలో శ్రీనగర్ జాతీయ రహదారిపై కాన్వాయ్‌తో వెళ్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లను మానవ బాంబుతో ఢీకొట్టడంతో 40 మంది జవాన్లు వీర మరణం పొందారన్నారు. ఈ సంఘటనతో దేశం ఉలిక్కిపడిందని, వెంటనే ప్రధాని మోదీ ఆదేశాలతో పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై వైమానిక దాడులు చేశారన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి వెంకట రామకృష్ణ, అసెంబ్లీ కన్వీనరు పితాని లీలావతి, పెండెం సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు నండూరి సత్తిబాబు, బల్ల సుధాకర్, కాదా మూర్తి పాల్గొన్నారు.

పుల్వామా అమరులకు ఘన నివాళి



అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న మాజీ సైనిక ఉద్యోగి శ్రీనగేష్

పుల్వామ దాడిలో మరణించిన అమరులకు రమణయ్యపేటలో ఘన నివాళులర్పించారు. స్థానిక ఏపీఐఐసీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగి శ్రీనగేష్ తదితరులు అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, రెడ్నం రాజా పాల్గొన్నారు.